జగజ్జననీ..పాహిమాం



మదనపల్లె: రాజరాజేశ్వరిగా కన్యకా పరమేశ్వరిదేవి, గుర్రంకొండ: మహిషాసురమర్దినిగా రెడ్డెమ్మతల్లి, పీలేరు : మహిషాసురమర్దినిగా రౌద్రాల అంకాలమ్మ



వాల్మీకిపురం: మహిషాసురమర్దినిగా కామేశ్వరిదేవి, కలకడ: కాళికాదేవిగా బోయికొండ గంగమ్మ, పెద్దతిప్పసముద్రం: దుర్గామాతకు ప్రత్యేక అలంకరణ

విజయదశమి శుభాకాంక్షలు



ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె: విజయదశమి అందరి ఇంటా విజయాలు చేకూర్చాలని రాజంపేట పార్లమెంటు సభ్యులు, వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్షనేత పీవీ.మిథున్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎప్పటికీ చెడుపై నిజమే విజయం సాధిస్తుందని తెలిపారు. చెడుపై సాధించే విజయానికి గుర్తుగా జరుపుకునే పండగ అందరికి స్ఫూర్తి ఇస్తుందని తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రతిఒక్కరి కుటుంబంలో సుఖశాంతులతో వర్ధిల్లాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.







ప్రతి ఇంటా విజయాలు వరించాలి

-ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



మదనపల్లె: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రతిఇంటా విజయాలు వరించాలని ఆకాంక్షిస్తున్నట్టు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్న ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ తదితరులు వేర్వేరుగా నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం

పీలేరు రూరల్: భక్తుల సహకారంతో గ్రామదేవత యల్లమ్మదేవి నూతన ఆలయ నిర్మాణం జరుగుతుందని, భక్తితోనే ఎవరికైనా ముక్తి సాధ్యమని ఆలయ కమిటీచైర్మన్ దేవిరెడ్డి వెంకట్రమణరెడ్డిఅన్నారు. బుధవారం పీలేరు టౌన్ చిత్తూరు రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వెలసిన యల్లమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. బుధవారం తెల్లవారు జామున వేదపండితుల వేదమంత్రాలతో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, చంద్రారెడ్డి, వంగిమళ్ళ.రామచంద్ర, పద్మనాభరెడ్డి, మేస్త్రీ రాజా, అశోక్‌రాజు, నాగరాజ, వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు. దాతలు శెట్టి సుబ్రమణ్యం, సద్దలపుష్పలత దంపతులు రూ.1,00,116, చంద్రారెడ్డి దంపతులు రూ.1,00,116, నారాయణరెడ్డి దంపతులు రూ.1,00,116, పద్మనాభరెడ్డి దంపతులు రూ.50,116, ప్రభాకర్ దంపతులు రూ.50,116 విరాళం ప్రకటించారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేష్

మదనపల్లె: మదనపల్లె వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ కే.రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఆస్పత్రిలో అన్థషియా వైద్యులుగా పనిచేస్తున్న ఆయనకు బాధ్యతలను అప్పగిస్తూ ఈనెల 9న ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చూస్తున్న డాక్టర్ కోటేశ్వరీ నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. కోటేశ్వరీని ప్రభుత్వం తిరుపతి స్విమ్స్‌కు బదిలీ చేసింది.

వ్యవసాయ పరికరాల ధర తగ్గింపు

కలకడ : జీఎస్టీ తగ్గించడం ద్వారా వ్యవసాయ పరికరాల ధరలు తగ్గాయని వ్యవసాయ అధికారి యంఆర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కలకడలో జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలు పంపిణీ చేశారు. గతంలో ఉన్న ధరలు, జీఎస్టీ తగ్గించినందుకు తగ్గిన ధరలను రైతులకు ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. జీఎస్టీ తగ్గింపు వలన ట్రాక్టర్ కొనుగోలుపై రూ. 21 నుంచి 85 వేల వరకూ, డ్రోన్స్‌పై రూ.61,250 వరకు, రోటోవేటర్‌పై రూ.5వేలు నుంచి రూ.15,700 వరకు ధర తగ్గినట్లు తెలిపారు.

పారిశ్రామికవేత్త టీఎస్ హర్షవర్ధన్‌రెడ్డి మృతి

తంబళ్లపల్లె: ప్రముఖ పారిశ్రామికవేత్త, మదనపల్లె బీటీ కాలేజీ మాజీ కరస్పాండెంట్ టీఎస్ రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీఎస్ అనసూయమ్మ దంపతుల కుమారుడు టీఎస్ హర్షవర్ధన్‌రెడ్డి (77) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందాడు. స్వగ్రామం తంబళ్లపల్లె టీఎస్ మామిడతోటలో శుక్రవారం ఉదయం 11 గంటలకు దహనక్రియలు నిర్వహించనున్నారు.









గోపిదిన్నెలో భూ రీసర్వే

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె రెవెన్యూ పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించి శుక్రవారం నుంచి భూములు రీ సర్వే నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగరాజు తెలిపారు. గోపిదిన్నె గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి రీ సర్వేపై అవగాహన కల్పిస్తామన్నారు. పంచాయతీలోని 5,310 ఎకరాల భూములు రీ సర్వే చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత రైతులు భూములకు సంబంధించిన రికార్డులు సర్వేబృందానికి అందజేసి తమ భూముల వివరాలతో భూమి సరిహద్దులతో పట్టాహక్కు పొందాలని తెలిపారు. రైతులు రీ సర్వే బృందానికి సహరించాలని కోరారు.

వేతనాల కోసం ధర్నా

మదనపల్లె: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు బుధవారం తమకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. వారికి మద్దతుగా ఏఐటియూసీ నాయకులు పాల్గొని వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఐదు నెలలుగా తమకు వేతనాలు చెల్లించలేదని చెప్పారు. తమకు 50 ఏళ్లు పూర్తయ్యాయని విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించబడిన 12 మంది కార్మికులకు న్యాయం చేయాలని వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఆర్ఎంఓ షకూర్‌ను కోరారు.



